క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు

తుని: ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించేందుకు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. పట్టణంలోని ఎస్.అన్నవరం రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు సోమవారం అధికారులు శ్రీకారం చుట్టారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రోడ్డును పలువురు ఆక్రమించి బడ్డీ కొట్లు ఏర్పాటు చేశారన్నారు. సువిశాలమైన రహదారి ఆక్రమణలకు గురికావడం వలన వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చామని, స్పందించక పోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణలో ఆక్రమణలు తొలగిస్తున్నట్టు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



తొండంగిలో మృతుడి కుటంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: మండలంలోని శృంగవృక్షం నూకాలమ్మ జాతరలో జరిగిన ఘర్షణలో మృతి చెందిన తొండంగికి చెందిన నడిపల్లి రాము కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు వైస్ ఎంపీపీ పార్టీ నాయకులతో కలిసి మృతుడి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. తన సొంత నిధులు రూ.లక్ష మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు గాబు రాజు, ఉప సర్పంచ్ కందా బాబ్జి, ఎంపీటీసీ శివకోటి ప్రకాష్, రౌతు శివ, పారేపల్లి సురేష్, వీర ప్రసాద్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వీఎస్ఎన్ మూర్తి స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో మేలు

ప్రత్తిపాడు రూరల్: రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో అన్నదాతలకు ఎంతో మేలు చేకూరుతుందని పెద్దాపురం ఎఫ్టీసీ ఏడీ మాధవి అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో అన్నదాతలకు రైతు ఉత్పత్తిదారుల సంఘాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎఫ్పీఓ సంఘాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రిన్సిపల్ సైంటిస్ట్ నాయుడు రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి వై.గంగాధర్, గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై అవగాహన

రౌతులపూడి: భూముల సమగ్ర రీసర్వేతో గ్రామాల్లోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ ఎల్.శివకుమార్ అన్నారు. మండలంలోని బలరామపురం సచివాలయంలో సోమవారం భూముల రీసర్వేపై అవగాహన సదుస్సు నిర్వహించారు. రైతుల భూముల సరిహద్దులు, 1బీ అడంగల్ వంటి వాటిని సరిదిద్దుకోవడానికి సర్వే చక్కటి అవకాశమన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజ్యలక్ష్మి, సర్పంచ్ దాసరి తాతాజీ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, డీటీ పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఎక్స్‌రే మెషీన్ ఏర్పాటు చేయాలి

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఎక్స్‌రే మెషీన్ ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం బీజేపీ పట్టణాధ్యక్షుడు గట్టెం వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ సూరపరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో క్స్‌రే మెషీన్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఎక్స్‌రే మెషీన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాకే కృష్ణారావు, గట్టెం సీతారామ్, కురాకుల రాజా, కొప్పిశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

గండేపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని తాళ్లూరు శివారు మణికంఠ దాబాను ఆనుకుని ఉన్న పాన్ షాప్‌లో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో రూ.3350 విలువ గల 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని మద్యం విక్రయిస్తున్న మార్ని త్రిమూర్తులును అరెస్ట్ చేశారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం పెద్దాపురం కోర్టుకు తరలించారు.

స్వామీ.. అభివృద్ధి కానరాదేమీ

- ఏలేశ్వరం సత్యనారాయణ స్వామి ఆలయంలో అరకొర వసతులు
- ఆదాయం ఉన్నా అభివృద్ధికి నోచుకోని వైనం
- సత్యవ్రతాలకు స్పందన కరవు



ఏలేశ్వరంలోని సత్యనారాయణస్వామి ఆలయం



క్వార్టర్ నిర్మించే స్థలంలో పెరిగిన తుప్పలు

ఏలేశ్వరం: అన్నవరం దేవస్థానం దత్తత ఆలయమైన ఏలేశ్వరం సత్యనారాయణస్వామి వారి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. పట్టణంలోని ఏలేరునది ఒడ్డున కొన్నేళ్ల క్రితం దాతల సహకారంతో సత్యనారాయణస్వామి ఆలయన్ని నిర్మించారు. కాలక్రమేణా ఆలయంతో పాటు భూమిని అన్నవరం దేవస్థానానికి అప్పగించారు. అప్పట్లో అన్నవరం దేవస్థానం ఈ ఆలయాన్ని పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీనిపై స్థానికులు అనేకసార్లు ఆందోళనలు, ఫిర్యాదులు చేయగా ఎట్టకేలకు అన్నవరం దేవస్థానం స్పందించి ఆలయాన్ని కూల్చివేసి నూతన ఆలయాన్ని పునర్నిర్మించింది. ఆలయ నిర్మాణ సమయంలో పలు అభివృద్ధి పనులు చేపడతామని చెప్పిన అధికారులు ఇప్పటివరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు.

కొండెక్కిన అభివృద్ధి పనులు

ఎట్టకేలకు పునర్నిర్మించిన ఆలయాన్ని 2010 జూన్‌లో ప్రారంభించారు. అప్పట్లో ఆలయంలో కార్యాలయ భవనాలు, బాత్‌రూమ్‌లు, ఆలయ వెనుకభాగంలో అర్చకుడికి క్వార్టర్‌లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆరేళ్లు దాటినా ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఆలయంలో పెళ్లిళ్లకు అనువుగా వసతులు కలిస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఆలయ అభివృద్ధి కుంటుపడిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

ప్రతివారం వ్రతాలు నిర్వహించినా...

అప్పట్లో అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిశని వారం వ్రతాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. అయితే భక్తుల నుంచి స్పందన కరువైంది. అన్నవరం దేవస్థానం తూతూమంత్రంగా కాకుండా ప్రత్యేక ప్రచారంతో భక్తులను ఆకట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఏజేన్సీ ముఖద్వారంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు అందుబాటులో ఉండే ఈ ఆలయంలో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తే ఆదాయం పెరగడంతో పాటు అభివృద్ధి చెందుతుందని భక్తులు కోరుతున్నారు. దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులకు వసతులు కల్పించాలి. పెళ్లిళ్లు జరిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రతివారం సత్యవ్రతాలు నిర్వహించాలి. దీనిద్వారా ఆలయానికి ఆదాయం సమకూరుతుంది.
– కటకం కిరిటీ, విశ్వహిందూపరిషత్ మండల కార్యదర్శి, ఏలేశ్వరం

పైడికొండలో సప్తాహ మహోత్సవాలు

తొండంగి: శ్రీరామ నవమి పురస్కరించుకుని పైడికొండ నరిశేవారి వీధిలోని రామాలయం వద్ద ఈ నెల 23 నుంచి సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భజన బృందాల సభ్యులు నిర్విరామంగా భజనలు, భక్తిపాటలు ఆలపిస్తున్నారు. ఈ నెల 30న ఈ సప్తాహ భజనలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు

పైడికొండ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఉదయం సీతారాముల కల్యాణోత్సవం, అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు సత్యహరిశ్చంద్ర నాటకం, పలు ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మండలంలోని తొండంగి, ఎ.కొత్తపల్లి, వేమవరం, బెండపూడి, గోపాలపట్నం, రావికంపాడు, సీతారాంపురం, కొమ్మనాపల్లి, ఏవీ నగరం తదితర గ్రామాల్లోనూ శ్రీరామ నవమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రామాలయాలను రంగులు, విద్యుత్ దీపాలతో సుందరగా తీర్చిదిద్దారు.

ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు నమూనా చెక్కు పంపిణీ



లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా పథకం ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని డ్వాక్రా సంఘాల సభ్యులకు నమూనా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సాంకేతిక కారణాల వల్ల మొదటి, రెండవ విడతల్లో ఆసరా నిధులు జమకాని సంఘాలకు ప్రస్తుతం మూడో విడతలో జమ చేయించినట్టు తెలిపారు. సాంకేతిక లోపాలతో ఆసరా పథకం నిధులు తమ ఖాతాల్లోకి జమకాకపోతే బయపడాల్సిన పనిలేదన్నారు. మహిళా సంఘాల్లోని ప్రతి సభ్యురాలికి లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని 1177 డ్వాక్రా సంఘాలకు చెందిన 11770 మంది సభ్యులకు రూ.8.75 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కందుల చిట్టిబాబు, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సర్పంచులు ములంపాక సురేష్, అడబాల ఆంజనేయులు, పార్టీ నాయకులు పరిమిబాబు, మలిరెడ్డి పాపారావు, తాళ్లూరి మధు, కోన గంగాధర్, ఎంపీడీఓ రామన్, ఈఓపీఆర్డీ మూర్తి, ఏసీ పదావతి, ఏపీఎం సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము

తుని రూరల్: గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏప్రిల్ 3న నిర్వహించే మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీపై సోమవారం ఏపీఎం వై.సత్తిబాబు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాము మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని అక్కచెల్లెమ్మలకు ఏప్రిల్ 3న తుని రాజా జూనియర్ కళాశాల మైదానంలో మంత్రి దాడిశెట్టి రాజా ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, నాయకులు దుంగల నాగేశ్వరరావు, లంక కృపానందం, వైఎస్సార్ క్రాంతి పథం సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జీవగిరి క్షేత్రానికి పాదయాత్ర

తుని రూరల్: అద్భుత జీవగిరి పుణ్యక్షేత్ర యాత్రను సోమవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హంసవరంలో ఆరోగ్యమాత దేవాలయం నుంచి క్రైస్తవులు సిలువ చేతబట్టి ఎనిమిది కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. పాస్టర్ ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో దివ్య బలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏటా నిర్వహించే వార్షికోత్సవంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించినట్టు పాస్టర్ ప్రతాప్ తెలిపారు. హంసవరం, తేటగుంట సర్పంచులు రాయి మేరీఅవినాష్, అత్తి నాగరాజు, గవరపేట, తేటగుంట, హంసవరం గ్రామాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రత్తిపాడు: శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల్లో కిశోర బాలికలకు వచ్చే నెల 3వ తేదీ వరకు పోషణ పక్వాడాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పద్మావతి తెలిపారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిషోర్ బాలికలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎనిమియా, చిరుధాన్యాలు, పర్సనల్ హైజీన్, మానవతా విలువలపై ప్రాజెక్టు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షణాధికారులు వీవీ అరుణశ్రీ, జానకి, పాఠశాల హెచ్‌ఎం వై.అచ్చిరాజు, సెక్టార్ సూపర్‌వైజర్ చక్రవేణి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జ్ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ఆ పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పంచాయతీ రాజ్ జోనల్ ఇన్‌చార్జ్, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమితులు కావడంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం తొలిసారిగా ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ నేతలు ఎన్ని కుయుక్తులు పన్నినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు తీరుకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే సత్తాలేక టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకుంటున్నాయన్నారు. తనను జోనల్ ఇన్‌చార్జ్‌గా నియమించిన సీఎం జగన్‌కు, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావుకు రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ, పార్టీనాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని వినతి



తొండంగిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తొండంగి: మండలంలోని శృంగవృక్షం నూకాలమ్మ జాతరలో జరిగిన ఘర్షణలో మృతి చెందిన నడిపల్లి రాము, గాయపడిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, అఖిల భారత్ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ సుబ్రహ్మణ్యానికి వినతిపత్రం సమర్పించారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శృంగవృక్షం గ్రామస్తులు కూడా బాధిత కుటంబాలను ఆదుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

పలువురి పరామర్శ

తొండంగిలోని మృతుడు నడిపల్లి రాము కుటుంబ సభ్యులను సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎం.ఏసు, పివైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.చిట్టిబాబు, జిల్లా అధ్యక్షుడు జి.బాలరాజు పరామర్శించారు.

విద్యతోనే సమసమాజ స్థాపన సాధ్యం



జగ్గంపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

జగ్గంపేట: అందరికీ విద్యను అందించడం ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. ఎస్ఎఫ్ఐ, యుటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞా వికాసంపై నిర్వహించిన టాలెంట్ టెస్టులో విజేతలకు స్థానిక వివేకానంద విద్యా సంస్థల్లో సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.దినేష్‌కుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా సహాయకార్యదర్శి రవివర్మ, యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

టెస్ట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఏలేశ్వరం: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ అబ్బాయి సూచించారు. ఎస్ఎఫ్ఐ, యుటీఎఫ్ సంయుక్తంగా మండలస్థాయిలో నిర్వహించిన ప్రజ్ఞ వికాశ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవితకు టెన్త్ క్లాస్ తొలి మెట్టు అన్నారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులకు చదవుపై ఏకాగ్రత ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవుల హక్కుల సాధనకు కృషి

ప్రత్తిపాడు: యాదవుల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని యాదవ హక్కుల పోరాట సమితి ఉభయ గోదావరి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ గొంప శివకుమార్ యాదవ్ అన్నారు. ప్రత్తిపాడులో సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకూ ఎవరూ యాదవుల హక్కుల సాధనకు కృషి చేయలేదన్నారు. నాటి శ్రీకృష్ణుని తరం నుంచి యాదవులు వెనుకబాటు తనానికి గురయ్యారన్నారు. హక్కుల సాధన, యాదవులను చైతన్యవంతం చేసేందుకు పాటు పడతానని తెలిపారు.

అన్నదానం

కోటనందూరు: కొత్త అమావాస్య ముగింపు వేడుకల్లో భాగంగా స్థానిక నూకాలమ్మ ఆలయం వద్ద సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. గ్రామ పెద్దల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు. సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి, ఉపసర్పంచ్ దార్ల సూర్యచంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, ఉల్లూరి శ్రీను భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్‌కు సత్కారం



చైర్మన్ ఐవీ రోహిత్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

అన్నవరం: రత్నగిరి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా మూడోసారి బాధ్యతలు చేపడుతున్న వ్యవస్థాపక ధర్మకర్త ఐవీ రోహిత్‌ను సోమవారం పలువురు నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పేరూరి బద్రీ, వ్యాపార వేత్త వీర్ల సూరిబాబు, మాజీ ఎంపీటీసీ రాజాల చిట్టిబాబు, బందారు ముత్యాలరావు, వీర్ల రాము తదితరులు చైర్మన్ రోహిత్‌ను సన్మానించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



ఏలూరులో పాదాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరులో నూతనంగా నిర్మించిన పాదాలమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నులపండువగా జరిగింది. గ్రామానికి చెందిన దాడిశెట్టి వీరబాబు దంపతులతో పురోహితులు విగ్రహ ప్రతిష్ఠ గావించారు. అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ప్రారంభించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జామి మాణిక్యం, వైఎస్సార్ సీపీ నాయకులు దాడిశెట్టి చక్రధర్, దాడిశెట్టి నూకాపతిరావు తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీటీసీ దాడిశెట్టి రాణి, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీతారాముల విగ్రహప్రతిష్ఠ

ఏలేశ్వరం: లింగంపర్తిలో సోమవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలోని బావివీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద పండితుడు నూకలచిట్టిబాబు ఆధ్వర్యంలో 11 మంది రుత్విక్కులు స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేయగా గ్రామానికి చెందిన గుర్రంశివ, మంగారాణి దంపతులు ప్రతిష్ఠించారు. తొలుత గణపతి పూజ, పూర్ణాహుతి, మండపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మాజీ ఎంపీపీ వరుపుల తమ్మయ్యబాబు, ఎస్‌జీవీ సుబ్బరాజు, మనుమంతు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



గోకవరంలోని దాసరివారి రామాలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

గోకవరం: గ్రామంలోని పలు ఆలయాల్లో సోమవారం దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్థానిక దాసరి వారి రామాలయంలో విఘ్నేశ్వరుడు, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. వేద పండితుడు ద్విభాష్యం సూర్యవెంకట సుబ్బారావుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్థానిక రవీంద్రనగర్‌లోని నూతనంగా నిర్మించిన రామాలయంలో గ్రామానికి చెందిన ఆచంట రాజు, విజయలక్ష్మి దంపతుల ప్రత్యేక పూజలు చేసి ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సచివాలయా మండల కన్వీనర్ దాసరి రమేష్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వెదురుపాక రామాలయంలో శ్రీరామనవమి వేడుకలకు పందిరిరాట వేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్



తునిలో ట్రేడ్ లైసెన్స్ బకాయి చెల్లించాలని అవగాహన కలిగిస్తున్న అధికారులు

తుని: పురపాలక సంఘం పరిధిలోని పన్ను బకాయిల వసూలుకు సోమవారం అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ఆదేశాల మేరకు అధికారులు వ్యాపారులకు దగ్గరకు వెళ్లి అవగాహన కల్పించారు. డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ తక్షణమే చెల్లించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

74 శాతం ఇంటి పన్నుల వసూలు

తుని రూరల్: ఎస్.అన్నవరం మేజరు పంచాయతీ పరిధిలో ఇప్పటివరకూ 74 శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేసినట్టు, వందశాతం వసూళ్లకు కృషి చేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఎన్ఎస్‌వీ మధుశేఖర్ సోమవారం తెలిపారు. పాత బకాయిలు రూ.16.57 లక్షలు, ఈ సంవత్సరం డిమాండ్ రూ.44.27 లక్షలు ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.45.12 లక్షలు వసూలు చేశామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జగ్గంపేట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి వైద్య సిబ్బందికి రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం సూచించారు. స్థానిక సీహెచ్‌సీని సోమవారం ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో వైద్యులకు పలు సూచనలు చేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక



కాంచన



పవన్‌కుమార్

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోట హైస్కూల్ విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. గత నెల 5న జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు హాజరు కాగా జిగటాల కాంచన, పెతకంశెట్టి పవన్ కుమార్ ఉపకార వేతనం పొందడానికి అర్హత సాధించారు. వీరికి నెలకి రూ.1000 చొప్పున ఇంటర్మీడియెట్ వరకూ కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించనుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపీపీ శ్రీనివాసు, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.